పేట్రేగుతున్న రేషన్ మాఫియా

- కేజీకి రూ.12 చెల్లింపు... వద్దని బియ్యం అడిగితే బెదిరింపు
- బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్న వైనం
- అధికారుల పర్యవేక్షణ కరువు



ఎండీఎం వాహనం వద్ద రేషన్ కోసం నిలబడిన కార్డుదారులు

నాదెండ్ల: పేదల కడుపు నింపే రేషన్‌బియ్యం పెద్దల జేబులు నింపే సరుకుగా మారింది. పేదలు తినే రేషన్‌బియ్యాన్ని అక్రమార్కులు బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్‌డిపో డీలర్లు, ఎండీఎం వాహనదారులు మాఫియాకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు. రేషన్ కార్డుదారులకు నామమాత్రంగా నగదు చేతిలో పెట్టి రేషన్‌బియ్యాన్ని మాఫియాకు అప్పగిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో వీరి దందా మూడు పువ్వులు, ఆరుకాయలుగా నడుస్తోంది. నాదెండ్ల మండలంలో 20,873 తెల్లరేషన్ కార్డులు ఉండగా, 44 మంది డీలర్లకు గాను 2868.62 క్వింటాళ్ల రేషన్‌బియ్యం ప్రతి నెలా పంపిణీ చేస్తున్నారు.

నగదు తీసుకోవాల్సిందే..!

ప్రతి నెలా 1 నుంచి 17 తేదీ వరకూ ఎండీఎం వాహనాల ద్వారా ఇంటింటికీ తిరిగి రేషన్‌పంపిణీ చేయాల్సి ఉంది. రేషన్‌కార్డులో ఉన్న కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉంది. కొందరు రేషన్ డీలర్లు ఒకట్రెండు రోజులు నామమాత్రంగా బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ఆతర్వాత కార్డుదారుల ఇళ్లకు వెళ్లి బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు వేయించుకుని కిలో రూ.12 చొప్పున నగదు చేతిలో పెడుతున్నారు. మాకు నగదు వద్దు, బియ్యమే కావాలని కార్డుదారులు కోరినా పట్టించుకోవటం లేదు. బియ్యం అయిపోయాయి.. నగదు తీసుకోవాల్సిందేనంటూ కార్డుదారులను ఒత్తిడి చేస్తున్నారు. గణపవరం గ్రామంలో కొందరు మహిళలు తమకు రావాల్సిన బియ్యం ఎక్కడికి వెళ్లాయంటూ నిలదీయటంతో డీలర్లు జారుకుంటున్నారు

సరిహద్దులు దాటించేస్తున్నారు

గణపవరం, తిమ్మాపురం గ్రామాల పరిసరాల్లో పత్తి, పొగాకు, ఆయిల్ మిల్లులు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఆయా పరిశ్రమల్లో ఒడిషా, బిహార్, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు చెందిన వేలాది మంది కార్మికులు నివశిస్తున్నారు. నామమాత్రపు కూలికే పని చేసే వీరు కడుపు నింపుకొనేందుకు రేషన్‌బియ్యమే వినియోగిస్తారు. స్థానికుల వద్ద మిగులుగా ఉన్న రేషన్‌బియ్యాన్ని వీరు కిలో రూ.15 చొప్పున కొనుగోలు చేసి తమ ఆహార అవసరాలకు వినియోగించుకుంటారు. అయితే గత కొన్ని నెలలుగా రేషన్ మాఫియా వలన కార్మికులు బియ్యం కొనకుండా అడ్డుపడుతున్నారు. వారిని గ్రామాల్లోకి రానీయకుండా బెదిరిస్తున్నారు. రేషన్‌బియ్యాన్ని పూర్తిగా తామే సేకరించి సరిహద్దులు దాటించి జేబులు నింపుకొంటున్నారు.

చర్యలు తీసుకుంటాం...



కార్డుదారులందరికీ బియ్యం, పంచదార పక్కాగా ఇవ్వాల్సిందే. డీలర్లు కార్డుదారుల ఇళ్లకు వెళ్లి బయోమెట్రిక్ వేయించుకుని నగదు ఇస్తున్నారంటూ ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయి. నియోజకవర్గంలో సీఎస్ డీటీ, మండలంలో డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ పోస్టులు ఖాళీగా ఉండటం వలన పర్యవేక్షణ కొరవడింది. ఈ నెల 17న డీలర్లు, ఎండీఎం ఆపరేటర్లతో జరగనున్న సమావేశంలో ఈ విషయమై స్పష్టమైన హెచ్చరికలు చేస్తాం.

– ఏవీ రమణ, తహసీల్దార్, నాదెండ్ల

డిజిటలైజేషన్ విధానంలో మహిళలకు రుణాలు



గ్రామసంఘం సభ్యులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న డీపీఎం

శావల్యాపురం: స్వయం సహాయక మహిళా సభ్యులు ఇక నుంచి తీసుకునే రుణాలకు సంబంధించి డిజిటలైజేషన్ విధానంలో అమలు చేయనున్నామని డీఆర్‌డీఏ కార్యాలయ డీపీఎం ఎల్. హెచ్. చినశ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో యాన్యువల్ క్రెడిట్ జీవనోపాధుల ప్రణాళిక నుంచి సూక్ష్మ రుణ ప్రణాళిక విధానంపై గ్రామ సంఘం సహాయకులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నేటి నుంచి 15 రోజుల పాటు గ్రామసంఘం సహాయకులు వెలుగు సీసీల పర్యవేక్షణలో గ్రామసంఘం సహాయకుల సారథ్యంలో గ్రూపులకు సమావేశాలు నిర్వహించి 20 మహిళా సంఘాల్లోని సభ్యుల బయోమెట్రిక్ వేయించాలన్నారు. ఇక నుంచి ప్రతి మహిళా సభ్యురాలు రుణం పొందాలంటే ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో సభ్యురాలు బయోమెట్రిక్ వేయించాలన్నారు. డిజిటల్ విధానంలో ఆర్థిక లావాదేవీలు కొనసాగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళలు అభ్యున్నతి కోసం డిజిటల్ విధానం ఎంతోగానో దోహదపడుతుందన్నారు. అనంతరం 15 రోజుల్లో చేయబోయే భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఏపీఎం జి.వాసుబాబు, మండల సమాఖ్యా అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి, సీసీలు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల దరఖాస్తుకు సాంకేతిక సమస్యలు



గణపవరం గ్రామ సచివాలయ భవనం

నాదెండ్ల: నూతన రేషన్ కార్డులు, రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల చేరికలు, తొలగింపులకు, చిరునామా మార్పుల దరఖాస్తులకు ఈ నెల 6వ తేదీన అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెలాఖరు నాటికి ఈ ప్రక్రియ ముగియనుంది. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను వెబ్‌సైట్‌ల్లో సచివాలయ సిబ్బంది నమోదు చేస్తున్నారు. అయితే గణపవరం, పసుమర్రు గ్రామ సచివాలయాల్లో నేటికీ వెబ్‌సైట్‌లు ప్రారంభం కాకపోవటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు గ్రామాల్లో చిలకలూరిపేట మున్సిపాలిటీలో విలీనమైన సంగతి తెలిసిందే. అప్పట్లో కొందరు వ్యక్తులు విలీన ప్రక్రియ నిలిపివేయాలంటూ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించటంతో న్యాయస్థానం స్టే విధించింది. అప్పటి నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి రేషన్‌కార్డు దారులకు ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై గణపవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి మారుతీబాబును వివరణ కోరగా, సచివాలయాల్లో వెబ్‌సైట్లు ఓపెన్ కాని మాట వాస్తవమేనని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

ముంపు గ్రామాల్లో సర్వేపై సిబ్బందికి అవగాహన



సర్వేపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ తదితరులు

బొల్లాపల్లి : పోలవరం బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి బొల్లాపల్లి మండలంలో రిజర్వాయర్ ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని తహసీల్దార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఏవీ సుధాకర్, పి.సీతారామయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రిజర్వాయర్ ఏర్పాటుపై సచివాలయ సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా బొల్లాపల్లి మండలంలో లింకుకు సంబంధించి రిజర్వాయర్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ముంపునకు గురయ్యే గ్రామాల్లో ఆర్థిక సామాజిక సర్వే సిబ్బందితో నిర్వహిస్తామన్నారు. ముంపునకు గురయ్యే రేమిడిచర్ల, గుమ్మనంపాడు, గరికపాడు, అయ్యన్నపాలెం, మేళ్లవాగు రెవెన్యూ గ్రామాల్లోని కుటుంబాలకు చెందిన ఆర్థిక సామాజిక సర్వేపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఆయా గ్రామాల్లో సర్వేకు పెద్ద టీమ్‌లు ఏర్పాటు చేయడమైందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రామకోటయ్య, రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని విత్తన విక్రయ కేంద్రాలలో అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి హెచ్చరించారు. విత్తనాల షాపులలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లైసెన్స్ తీసుకోకుండా రైతులకు విత్తనాలు విక్రయించడం చట్టరీత్యా నేరమని చెప్పారు. షాపు నిర్వహణకు సంబంధించి ప్రతి సంవత్సరం ప్రభుత్వ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. విత్తనాల షాపు నిర్వాహకులు ఎవరైనా అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే వారిపై విత్తన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధరల విషయంలో రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లు అయితే అటువంటి షాపులను శాఖాపరమైన చర్యలు తీసుకుని సీజ్ చేస్తామన్నారు. 25 నుంచి 35 రకాల కంపెనీలకు చెందిన విత్తనాలను పరిశీలించినట్లు చెప్పారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో విత్తనం ఏ కంపెనీకి చెందినది, రకం పేరు, లాట్ నంబర్‌తో సహా కొనుగోలు రసీదుపై రాయించుకుని పంట దిగుబడి వచ్చే వరకు కూడా భద్ర పరుచుకోవాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఎంఏఓలు గొంటు కృష్ణారెడ్డి, సతీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

వైద్యశాల ప్రాంగణంలో అన్న సంతర్పణ

సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో డొక్కా సీతమ్మ అన్న ప్రసాద వితరణ పథకంలో భాగంగా జనసేన పార్టీ నాయకుడు అప్పాపురం నరేంద్ర ఆధ్వర్యంలో బుధవారం కటకం కాశీ విశ్వనాథం ధర్మపత్ని కాశీ కుమారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా 140 మంది నిరుపేద రోగులు, వారి సహాయకులకు అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నిస్వార్థంగా చేస్తున్న సేవకు ప్రతిఫలంగా దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నందుకు నరేంద్రను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ సుజాత, డాక్టర్ జీవన్ జ్యోతి, నాయకులు చౌటా శ్రీనివాసరావు, జవ్వాజి రామోహన్‌రావు, సూరే కోటేశ్వరరావు, కట్టమూరు అప్పారావు, పోతుగంటి నరసింహారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



నరసరావుపేట ఈస్ట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20వతేదీన తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కరపత్రాల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని అన్ని బ్యాంక్‌లలో ఉద్యోగులకు, ఖాతాదారులకు సమ్మె కరపత్రాలను పంపిణీ చేసారు. ప్రతి ఒక్కరూ సమ్మెకు మద్దతు అందించి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, ఏరియా అధ్యక్ష్య, కార్యదర్శులు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, రైతు సంఘం నాయకులు చక్రవరం సత్యనారాయణరాజు, ఖాదర్‌వలి పాల్గొన్నారు.

గణపవరంలో ఆధార్ అప్‌డేట్ సెంటర్



నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం-1 సచివాలయంలో బుధవారం ఆధార్ అప్‌డేట్ సెంటర్ ప్రారంభమైంది. గురువారం సైతం సెంటర్ పనిచేయనుంది. ఆధార్‌లో మార్పులు చేర్పులు, చైల్డ్ ఆధార్ నమోదు చేయనున్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు కోరారు.

ఎడ్వర్డ్‌పేటలో కార్డన్ సెర్చ్



రొంపిచర్ల: మండలంలోని ఎడ్వర్డ్‌పేట గ్రామంలో మంగళవారం రాత్రి కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ నెల 11వ తేదీన గ్రామంలో ఇరువర్గాలు దాడులు, రాళ్లు రువ్వుకోవడం లాంటి గొడవలు ఏర్పడిన దృష్ట్యా రొంపిచర్ల పోలీసులు కార్డన్ సెర్చ్ చేపట్టారు. తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 6 పెద్ద మలాట్లు, 4 గొడ్డళ్లు, 8 కొడవళ్లతో పాటు ఒక సుత్తిని కూడా స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ మణికృష్ణ తెలిపారు. గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగుతుందన్నారు.

పిచ్చికుక్క కరిచి గేదె మృతి



నూజెండ్ల: పిచ్చి కుక్క కరవటంతో గేదె మృతి చెందిన మండలంలోని దాట్లవారిపాలెం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఆళ్ల గురవారెడ్డికి చెందిన గేదె రెండు రోజుల క్రితం పిచ్చి కుక్క దాడిలో గాయపడింది. అప్పటి నుంచి చికిత్స అందిస్తున్నప్పటికీ బుధవారం గేదె మృత్యువాత పడినట్లు మండల పశువైద్యాధికారి శివాజీ తెలిపారు. గేదెకు బీమా ఉండటంతో రూ.60 వేలు పరిహారం అందినట్లు యజమాని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

వినుకొండ: యువతి అనుమానాస్పద మృతిపై కేసు నమోదయింది. సేకరించిన వివరాల ప్రకారం...సుభాషిణి (25) అనే యువతి వినుకొండ పట్టణంలోని రెడ్డినగర్ 2వ లైన్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ వేరొక వ్యక్తితో సహజీవనం చేస్తుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో మరొక ప్రాంతం నుంచి వచ్చి ఇక్కడ నివాసం ఉంటున్న సుభాషిణి గత వారం రోజులుగా కనిపించకపోవడం, ఇంట్లోనుంచి దుర్వాసన రావడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఇంటి తలుపులు తెరిచి చూడగా, లోపల యువతి మృతదేహం లభించింది. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పట్టణ సీఐ శోభన్‌బాబు తెలిపారు.

ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినికి ప్రోత్సాహం

బెల్లంకొండ: సీబీఎస్ఈ పదవ తరగతి ఫలితాలలో 580 మార్కులు సాధించి, మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన మాచాయపాలెం గ్రామానికి చెందిన భాగం ప్రసన్నకు బెల్లంకొండ ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి బుధవారం నగదు ప్రోత్సాహం అందజేశారు. పేద కుటుంబానికి చెందిన ప్రసన్న కష్టపడి చదివి మంచి మార్కులు సాధించడం గర్వించదగ్గ విషయమని అన్నారు. భవిష్యత్తులో ఉన్నత విద్య అభ్యసించాలని ఆకాంక్షించారు. గ్రామ నాయకులు పాల్గొన్నారు.

భారీగా మొక్కల పంపిణీకి ఒప్పందం



చిలకలూరిపేట: పర్యావరణ పరిరక్షణ, రైతుల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్రవ్యాప్తంగా మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ డాక్టర్ జాష్టి రంగారావు చెప్పారు. రాష్ట్రంలో మొక్కల పంపిణీకి సంబంధించి అసిస్ట్, వ్యవసాయాధారిత సంస్థ వరాహ సంస్థల మధ్య బుధవారం ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ పండ్ల తోటలు, వన జాతుల మొక్కల ఉచిత పంపిణీ ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయ మార్గాల వైపు నడిపించవచ్చని చెప్పారు. వచ్చే వర్షాకాలం సీజన్ నుంచి రూ. 5.24 కోట్లతో 4.50 లక్షల మామిడి, జీడి, కొబ్బరి, నిమ్మ, ఎర్ర చందనం, టేకు మొక్కలను రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. అసిస్ట్ సంస్థ స్థాపించినప్పటి నుంచే గ్రామీణాభివృద్ధి, రైతుల ఆర్థికాభివృద్ధి, ఉద్యాన వన అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నట్లు చెప్పారు. వరాహ సంస్థ మేనేజర్ ఎంఎస్ఎన్ మూర్తి, అసిస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ




నరసరావుపేట ఈస్ట్: ఆపరేషన్ సిందూర్‌లో అమరులైన సైనికులకు, ఉగ్రదాడుల్లో ప్రాణాలు కోల్పోయిన పౌరులకు సంతాపం ప్రకటిస్తూ బుధవారం రాత్రి శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలోని సాహితీ, కళ, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు కొవ్వొత్తులతో శాంతి ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రవాదం నశించాలని నినదించారు. ఉగ్ర దాడుల్లో మరణించిన కుటుంబాలకు దేశ ప్రజలు అండగా ఉండాలని తెలిపారు. పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, మానవత సంస్థ ప్రతినిధి మేదరమెట్ల శేషగిరిరావు, శ్రీనరసరావుపేట కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సంయుక్త కార్యదర్శి షేక్ బాజీ, వివిధ సంస్థల ప్రతినిధులు చేగు వెంకటేశ్వరరావు, షేక్ రసూల్, ఎం.కృష్ణయ్య, పద్యకవి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి హుండీ ఆదాయం రూ.33,693

నకరికల్లు: స్థానిక కొండపై వేంచేసి ఉన్న ఆదిలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి తిరునాళ్ల సందర్భంగా హుండీ ఆదాయం రూ.33,693 వచ్చినట్లు ఈఓ ఆర్.వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. సోమ, మంగళ వారాల్లో జరిగిన తిరునాళ్ల, కల్యాణ వేడుకల అనంతరం భక్త సంఘం సమక్షంలో హుండీల్లో వచ్చిన కానుకలను బుధవారం లెక్కించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్ విధానాలపై సమష్టి పోరాటం



మాజీ మంత్రి విడదల రజినితో మాట్లాడుతున్న డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి

చిలకలూరిపేట: కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న రెడ్ బుక్ రాజ్యాంగ విధానాలకు వ్యతిరేకంగా సమష్టిగా పోరాడుదామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి చెప్పారు. బుధవారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకురాలు విడదల రజిని నివాసానికి ఆయన విచ్చేసారు. ఇటీవల చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు మాజీ మంత్రితో అనుచితమైన రీతిలో ప్రవర్తించటం తీవ్రంగా ఖండించదగ్గ పరిణామమని విమర్శించారు. ఒక మహిళపై పోలీసుల వ్యవహారశైలి సభ్యసమాజం ఏ మాత్రం సహించదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు పార్టీ భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించుకున్నారు.

కొనసాగుతున్న 50 రోజుల ప్రత్యేక ప్రార్థనలు



ప్రపంచ ప్రార్థన దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించిన దైవసేవకులు

చిలకలూరిపేటటౌన్: శాంతి, సమైక్యత ప్రజల క్షేమం కోసం చేపట్టిన 50 రోజుల ప్రత్యేక ప్రార్థన కార్యక్రమం వేగంగా ముందుకు సాగుతోంది. ఈస్టర్ రోజున ప్రారంభమైన ఈ ఉదయకాల ప్రార్థనలు పెంతెకోస్తు ఆదివారమైన జూన్ 8వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. బుధవారం 25వ రోజు ప్రార్థన సభను పట్టణంలోని సుభాని నగర్ ఐపీపీ చర్చిలో నిర్వహించారు. పాస్టర్ కె.ఆషేరుబాబు నాయకత్వం వహించగా, పాస్టర్ మేకతోటి నారాయణమూర్తి పర్యవేక్షణలో దైవ సేవకులు ఎస్.థామస్, ఎస్.అబ్రహం, ఎం.సంసోను, బుజ్జి, కె.శాంతిసాగర్, పాల్‌సారథి, బత్తుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఒక్కో దైవసేవకుడు తన అనుభవాన్ని పంచుకుంటూ, దేశం కోసం కన్నీటితో వేడుకున్నారు. అనంతరం పాస్టర్ ఆషేరుబాబు మాట్లాడుతూ దైవ సేవకుల ఆధ్వర్యంలో 50 రోజులు ఆధ్మాత్మిక యాత్రను చేపట్టామని, పెంతెకోస్తు ఆదివారమైన జూన్ 8వ తేదీ వరకు ఇది నిర్విరామంగా కొనసాగుతుందన్నారు. జూన్ 8న ముగింపు నాడు ప్రపంచ ప్రార్థన దినోత్సవమని, లక్షలాది మంది క్రైస్తవులు ఒకేవేళ ప్రార్థించేలా సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. పవిత్రదినాన ప్రతిసంఘం, ప్రతి గృహం దేవుని ఆలయంగా మార్చేందుకు పిలుపు నిస్తున్నామని తెలిపారు. ఈ ఆధ్యాత్మిక యాత్ర, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలిచే దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అనంతరం ప్రపంచ ప్రార్థన దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉరితాళ్లే శరణ్యం

- మున్సిపల్ కార్మికుల ఆవేదన
- 56వ రోజుకు చేరిన నిరసన దీక్షలు



మున్సిపల్ కార్యాలయం ఎదుటనున్న శిబిరంలో ఉరితాళ్లతో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

నరసరావుపేట: తమ సమస్యలు పరిష్కరించకపోతే తమ కుటుంబాలకు ఇక మిగిలేది ఉరితాళ్లేనని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ గత 56రోజులుగా మున్సిపల్ కార్యాలయం ఎదురు నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు బుధవారం ఉరితాళ్లు తలకు బిగించుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాల్మన్ మాట్లాడుతూ కార్మికులకు రూ.21వేల జీతం ఇవ్వాలని, ఆప్కాస్‌లో నమోదైన కార్మికులు అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో ఎన్నోమార్లు విన్నవించుకున్నా తీరలేదన్నారు. సమస్య ఈ విధంగానే ఉంటే కార్మికులు అందరూ ఉరితాళ్లు వేసుకొని ఆత్మహత్యలు చేసుకోవటమే మిగిలి ఉందన్నారు. తమ బతుకులను రోడ్లపై పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఆప్కాస్‌లో చేరినా మీతో మాకు సంబంధం లేదు, మీరు బదిలీ కార్మికులు అంటూ దుర్మార్గంగా మాట్లాడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు కలుగజేసుకుని సమస్య పరిష్కరించాలని వేడుకున్నారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి



మృతిచెందిన అనంతరాములు



అదుపు తప్పిన ఇటుక లోడు ట్రాక్టర్

బొల్లాపల్లి: ఇటుకల లోడు ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా కొట్టడంతో యువకుడు మృతి చెందిన సంఘటన జరిగింది. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం ముటుకుల గ్రామం నుంచి వినుకొండకు వస్తున్న ఇటుకులలోడు ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టిన ప్రమాదంలో మూరబోయిన అనంతరాములు (23) మృతిచెందాడు. బండ్లమోటు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం తెల్లగట్లకు చెందిన గోవిందు వెంకటరమణ దంపతుల కుమారుడు అనంతరాములు గత రెండేళ్లుగా ముటుకులకు చెందిన బి.సాంబయ్య ఇటుకల బట్టీలో పనిచేస్తున్నాడు. బుధవారం ఇటుకులలోడు ట్రాక్టర్‌తో వినుకొండకు బయలుదేరాడు. వెల్లటూరు కురవ వద్ద ట్రాక్టర్ అదుపుతప్పటంతో బోల్తా కొట్టింది. ప్రమాదంలో అనంతరాములు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎ.బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వినుకొండ తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వైభవంగా వాసవీమాత ప్రతిష్టా మహోత్సవం



విశేష అలంకరణలో వాసవీ అమ్మవారు

యడ్లపాడు: తపోవ్రతాన్ని, అహింసా సూత్రాన్ని పాటించిన శాంతి స్వరూపిణి.. వైశ్యుల కులదైవమైన వాసవీ కన్యాక పరమేశ్వరీదేవి ప్రతిష్టా మహోత్సవం వైభవోపేతంగా జరిగాయి. మండలంలోని ఉన్నవ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం ఉదయం 9.27 గంటలకు కన్యకా అమ్మవారి యంత్రబింబం(విగ్రహం)తో పాటు మహాగణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సింహవాహన, విమాన కలశాల ప్రతిష్టలు డాక్టర్ జంధ్యాల వెంకట రామలింగేశ్వరశాస్త్రి పర్యవేక్షణలో వేద మంత్రోచ్చారణల నడుమ ఘనంగా నిర్వహించారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవాచనం, కడన్యాసము, హోమం, నేత్రోన్మీలనం, మహాకుంభాభిషేకం, ధేను దర్శనం, మహా పూర్ణాహుతి వంటి పూజా కార్యక్రమాల్లో గ్రామస్తులే కాకుండా సమీప ప్రాంత ప్రజలు పెద్దఎత్తుగా హాజరై అమ్మవారిని దర్శించి పూజించి తరించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరైన వేలాది భక్తులకు దేవస్థాన కమిటీ అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వచ్చే పోయే భక్తులతో గ్రామంలో ఆధ్మాత్మిక సందడి నెలకొంది. సాయంత్రం ఆలయానికి విద్యుత్‌దీపాలంకరణ గావించారు.

పెనుగొండకు మాజీ ఎమ్మెల్యే కాసు నివాళి

నరసరావుపేట: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, వైభవ్ జ్యూయలర్స్ అధినేత పెనుగొండ వెంకటేశ్వరరావు అంత్యక్రియల్లో గురజాల మాజీ శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి బుధవారం పాల్గొన్నారు. వెంకటేశ్వరరావు గుండెపోటుతో మంగళవారం మృతిచెందిన విషయం విధితమే. ప్రకాష్‌నగర్‌లోని స్వగ్రహంలో ఉన్న మృతదేహాన్ని మహేష్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలియచేశారు. అదేవిధంగా మాజీమంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. కాగా, గుంటూరురోడ్డులోని స్వర్గపురిలో పెనుగొండ వెంకటేశ్వరరావు అంత్యక్రియలను నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కపలవాయి శివప్రసాదు, వై.రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

లక్కరాజు గార్లపాడులో ఇంటిపై పడిన పిడుగు

సత్తెనపల్లి: పిడుగు పడి తృటిలో ప్రమాదం తప్పిన సంఘటన సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడులో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు కమ్మి ఈదురు గాలుల, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో లక్కరాజుగార్లపాడు గ్రామంలో సత్తెనపల్లి ఏడుకొండలు ఇంటిపై పిడుగు పడటంతో పిట్టగోడ, బీము, పోల్స్ పగిలిపోయాయి. ఇంట్లోని టీవీ, విద్యుత్ వైర్లు కాలిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఒక్కసారిగా ఇంటిపై పిడుగు పడటంతో ఆ కాంతికి ఇంట్లోని కుటుంబ సభ్యులకు కళ్లు బైర్లు కమ్మాయి. అయితే ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. జనం తడోప తండాలుగా దాబాలు ఎక్కి పిడుగు పడిన ప్రాంతాన్ని పరిశీలించారు.